21102024-MAI-04_Layout 1 10/21/2024 1:30 AM Page 1

చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

దివ్యతార

ఆయుధం లేకుండా
నెత్తురు బొట్టు రాలకుండా
ఒక్క సిరా చుక్కతోనే
మృత్యు 'ఉపా'ఖ్యానం రాశారు

కళ్ళకు గంతలు కట్టుకొని
తూనిక రాళ్ళులేని తరాజు పట్టుకొని
గర్వంగా నిలబడ్డ తెల్లని దేవత కూడా
అటు వైపే మొగ్గింది

బతుకుకు భరోసానిచ్చే హక్కులను కాలరాచి
మనిషి చావును శ్వాసించవచ్చు..
కాలం కనీ వినీ ఎరుగని ఈ హత్యను చూసి
సిగ్గుతో తలదించుకుంది శిక్షాస్మృతి
పందొమ్మిదవ పుటకు చెదలు పట్టిందని
మూగగా రోదిస్తుంది సంవిధానం..
వచ్చే ఓటుకోసం తప్ప పోయిన ప్రాణం గురించి
బెంగ ఎవరికుంటుంది?

అసలు ప్రజాస్వామ్యరక్షణ ఎరుకే
ఇప్పుడు క్షమించరాని పాపం!
ప్రశ్నల ఇంద్ర ధనస్సును
పాశవికంగా తెగ నరకటమే
నేడు పవిత్ర ధర్మం!

పరమ నిశ్శబ్దంగా ఊపిరి బీపాలను చిదిమివేసే
ఈ వైకల్య వ్యవస్థ కోసం
వీల్‌చైర్‌ను విడిచిపెట్టి
దివ్య నక్షత్రమై అతను
గగనంలో మబ్బుల మీదికెక్కాడు.

కోయి కోటేశ్వర రావు,
94404 80274

నాటకరంగ శిఖరం కేఎల్

(అక్టోబర్ 23న శత జయంతి)

విద్యార్థి దశ నుంచే నాటక రచనా ప్రక్రియకు అంకితమై రచన, నటన, సమాజ సేవలే శ్వాసగా పాటుబడిన సాహితీ దిగ్గజం, మహోన్నత కళాకారుడు కోదాటి లక్ష్మీనర్సింహారావు, క్లుప్తంగా కేఎల్. తన రచనా వ్యాసంగంతో, తన ఆలోచనా విధానంతో పల్లె ప్రాంతాల్లోని ప్రజల్లో మానసిక చైతన్యాన్ని నింపిన అక్షర తేజోమూర్తి. తన జీవిత కాలాన్నంతా గ్రామీణుల కోసమే వినియోగించిన త్యాగజీవి.



ఉమ్మడి నల్లగొండ జిల్లా మునగాల పరగణా రేపాల గ్రామంలో 23-10-1924న జన్మించిన కేఎల్ 10వ తరగతి కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో చదువుకున్నారు. అక్కడ కమ్యూనిస్టు భావజాలం ఉన్న టీచర్ల ప్రోత్సాహంతో విప్లవ సాహిత్యం, మిగతా సాహిత్యాలు చదువుకున్నారు. దాంతో ఆయన మనస్సులో విభిన్న దృక్పథాల బీజాలు పడ్డాయి. చదువు ముగిచుకొని 1944లో రేపాలకు వచ్చిన కేఎల్ కొందరు భూస్వాములు జీతగాళ్లను చాలా చులకనగా చూడటం, ఇబ్బందులు పెట్టడం చూసి చలించిపోయి అభ్యుదయ భావజాలంతో రాసిన మొదటి నాటకం 'విప్లవ శంఖం'. తన మిత్రులు వేముల నర్సింహం సహాయంతో ఇది వేశారు. సమాజంలో మార్పు తేవాలనే ఉద్దేశంతో కొంతమంది యువకులతో కలిసి 1946 జనవరి 1న రేపాలలో 'గ్రామ వెలుగు నాట్యమండలి' స్థాపించారు. ఈ సంస్థ ద్వారా రేపాలకు అనేకమంది సినీ, రంగస్థల, రాజకీయ, అధికార, సాహితీవేత్తలను రప్పించి జనరంజక కార్యక్రమాలు నిర్వహించారు. వైజ్ఞానిక మహాసభల పేరుతో జనచైతన్య ప్రదర్శనలు నిర్వహించారు. అలా రేపాలకు వచ్చినవారిలో ప్రముఖులు అక్కినేని నాగేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావు, టీఎల్ కాంతారావు, సీఎస్ఆర్, గుమ్మడి వెంకటేశ్వరరావు, పద్మనాభం, నాగభూషణం, రేలంగి వెంకట్రామయ్య ఉన్నారు. పీవీ నరసింహారావు, కోదాటి నారాయణరావు, కే.రోశయ్య వంటి అనేక మంది రాజకీయ ప్రముఖులనూ రేపాలకు రప్పించారాయన. గోరా శాస్త్రి, సీఎస్ఆర్ ఆంజనేయశాస్త్రి, రచయితలు త్రిపురనేని గోపీచంద్, కాశీపతి, వట్టికోట ఆళ్వార్‌స్వామి, డాక్టర్ సి.నారాయణరెడ్డి, వాసిరెడ్డి నీతాదేవి, పాలగుమ్మి విశ్వనాథం, రావూరి భరద్వాజ, బుచ్చిబాబు, ఇంకా అనేకమంది ఉన్నారు.

పత్రికా రచయితగా 1950లో హైదరాబాద్‌లో కోదాటి నారాయణరావు స్థాపించిన 'ప్రగతి' పత్రికలో సహాయ సంపాదకునిగా పని చేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 1953లో నిర్వహించిన ప్రజావాణి పత్రికలో కూడా పనిచేశారు. అప్పుడే కోలన్, భవదీయుడు, కేఎల్, బూర్జువా, బురఖా అనే పేర్లతో అనేక రచనలు చేశారు. మద్రాసు నుంచి వస్తున్న పత్రిక 'తెలుగు స్వతంత్ర'లోనూ ఆయన అనేక రచనలు అచ్చయ్యాయి. 'తెలంగాణ తీరు తెన్నులు' అనే శీర్షిక కింద వ్యాసాలు రాసేవారు.

> సమాజంలో మార్పు తేవాలనే ఉద్దేశంతో కొంతమంది యువకులతో కలసి 1946 జనవరి 1న రేపాలలో గ్రామవెలుగు నాట్యమండలి' స్థాపించారు. ఈ సంస్థ ద్వారా రేపాలకు అనేకమంది సినీ, రంగస్థల, రాజకీయ, అధికార, సాహితీవేత్తలను రప్పించి జనరంజకకార్యకర్మాలు నిర్వహించారు.

దాదాపుగా ఎనిమిదేండ్లు పత్రికారంగంలో పనిచేసినా రంగస్థలం కోసం చేసిన సేవల ద్వారానే ఆయన ఎక్కువగా గుర్తింపు పొందారు. తెలంగాణ భాషకు తన రచనల్లో పట్టం కట్టిన కేఎల్ 150కి పైగా నాటకాలు రాశారు. అందులో 90 శాతం ముద్రితమైనా యి. దాదాపుగా అన్ని ప్రక్రియ ల్లో ఆయన నాటక రచనా వ్యాసంగం కొనసాగించారు. ఆయన రాసిన సాంఘిక నాటకాలలో విప్లవ శంఖం, ఆదర్శలోకాలు, అభాగ్యులు, స్వార్థం, సుడిగుండా లు, తోడు నీడలు ముఖ్యమైనవి. ఇవే కాకుండా రైతుల సమస్యలపై గెలుపు నీదే, అడుగుజాడలు, కొత్త గుడి, అగ్నిపరీక్ష, భారతి, ప్రజాదేవత, తుపాకీ రాజ్యం, చీమలు పెట్టిన పుట్టలు, కొడిగట్టిన దీపాలు, కల్పతరువు, తొలకరి, నేల విడిచిన సాము మొదలైనవి ఉన్నాయి. ఇక పిల్లల కోసం పుట్టినరోజు పండుగ, మతి లేని మహారాజు, సమాజం పట్ల మనిషి బాధ్యతలను సున్నితం గా తెలియజేస్తూ హాస్యనాటికలు రాశారు. ఉంగరాల వేళ్లు, అపరాధ పరిశోధకులు, రేపటికి వాయిదా మొదలైనవి ఆ కోవలోనివే. మనస్తత్వం విశ్లేషణతో క్రీనీడలు, ఒకరోజు, పాపఫలం, చీకటిని తిట్టకు దీపాన్ని వెలిగించు వంటివి రాశారు. అక్బర్ అనే చారిత్రక నాటకా న్ని కూడా రాశారు.

ఆకాశవాణిలోనూ ఆయన తన అక్షరసేద్యాన్ని కొనసాగించారు. చిన్నపిల్లల కోసం వెర్రి వెంగళప్ప కబుర్లు, గ్రామీణ ప్రజల కోసం గ్రామ సీమల ముచ్చట్లతో చాలాకాలం ఆకాశవాణిలో శ్రోతలను అలరించారు. ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు తలపెట్టిన కార్యక్రమాల్లో వయోజన విద్యా కార్యక్రమం ఒకటి. దీనిద్వారా అందరికీ చదువు నేర్పాలనేది ఉద్దేశం. పెద్దలకు విద్య అవసరమని, చదువుతో ఇంటిని కాంతిమయం చేసుకోవచ్చని ఆయన ఈ కార్యక్రమంలో సామాన్యుల మనసుకు హత్తుకునేలా వివరించేవారు.

1984లో పీవీ నర్సింహారావు సలహా, సూచనల మేరకు ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం కోసం ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అప్పుడు రాసినవే భారతి, తుపాకీ రాజ్యం, ప్రజాదేవత, డప్పు సాయిగాడు, చీమలు పెట్టిన పుట్టలు. సాహిత్య అకాడమీ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యులుగా పనిచేసిన కేఎల్ 2003 జూలై 22న కన్నుమూశారు.

వేమూరి వెంకటేశ్వర్లు
98483 30777

(వ్యాసకర్త: తెర సాంస్కృతిక కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు)



ఓడ్ టు శివారెడ్డి
(అను ప్రేమగీతం)

గురువేం జేస్తాడు?
బిచ్చమెత్తుకుంటూ ఉంటాడు
లేబర్ అడ్డాల దగ్గర, పొలాల్లో, గనుల దగ్గర
తునికాకులు సేకరించే గిరిజనుల వెంటపడి
విప్పపూలు నెత్తికెత్తుకునే మహిళల వెంటపడి
అమ్మా మాదాకబళం తల్లీ!
అయ్యా మాదాకబళం తండ్రీ
ఇంట్లో ఒంట్లో పద్యాలు ఆకలితో ఉన్నాయి
మీ పాద ధూళుల్ని బిచ్చమెయ్యండమ్మా
మీ కండల మీద ఎండిన చెమట తాలూకు
చిటికెడు ఉప్పు రేణువులు ఇవ్వండమ్మా
మీ ఎంగిలి రొట్టెముక్కని బిచ్చమెయ్యండమ్మా
అంటూ భిక్షాటన చేస్తుంటాడు
గని కార్మికుడి హెల్మెట్‌లో దీపం లాటి
జీవభాష ముందు మోకరిల్లి అడుగుతాడు
అమ్మా నీ పదాల పాదధూళులు
కాస్త బిచ్చమెయ్యి తల్లీ! అంటూ
ఆమె ఎవరైతేనేం అంటూ స్త్రీత్వం ముందు మోకరిల్లుతాడు

గురువేం జేస్తాడు
ఓ కంటి నుండి దుఃఖాశ్రువులు
ఇంకో కంటి నుండి ఆనంద బాష్పాలు
మూడోకంటి నుండి నిప్పులు కురుస్తూ
ఉన్మాదిగా ఏక కాలంలో నవ్వుతూ ఏడుస్తూ
కలుపుతాడు వాటిలో పాదధూళుల్ని చేస్తాడు
సంధ్యాకాశం ముందు నిలబడి
దోసెడు ఎర్రమబ్బుల్నీ సిరా సముద్రం మీద
తేలే యాపిల్ పండునీ జోలెలో వేసుకొస్తాడు
కొండ మీద నుంచి రేగుపళ్లు, ఈతపళ్లతో పాటు
మాగేసిన పదాల్ని, మాటల్ని తీసుకొస్తాడు నేల మీదకి
బుట్ట దించేసరికి నిజంగానే అయన కడుపులో
ఆవురావురంటూ ఎదురు చూస్తుంటారు అంతర్జనాలు
కొందరు పిడికిళ్లెత్తి నినాదాలు చేస్తుంటారు
కొందరు పొలాలు దున్ని విత్తులు చల్లుతారు
మహిళలు పాటలు పాడుతూ నాట్లు వేస్తుంటారు
కొందరు తమ నెత్తుటి దీపాలతో నక్షత్రాలై
చీకటి రాత్రుల శిరస్సున నర్తిస్తుంటారు

గురువేం జేస్తాడు
నెత్తిమీది పళ్ల బుట్టని దించి ముసలమ్మలా గొంతుక్కూర్చుంటాడు
ఒక్కో పదాన్ని ఒక్కో మనిషిలో ముంచి
ఒక్కో పద్యాన్ని బయటికి తీస్తాడు
గుప్పిళ్ల కొద్దీ పదబంధాలు రూపుకడతాడు
సామూహిక స్వప్నాల్లోంచి లేచిన నినాదాలకు
పద్యాల దేహాలనిస్తాడు

గురువేం జేస్తాడు..
అడవుల్లోకి పోయి విల్లమ్ముల రహస్యాలు వింటాడు
అడవి నిశ్శబ్దంలో నేత్ర ధనుష్టంకారాలు వింటాడు
గురితప్పని నేత్రాల్ని అక్షరాల దొన్నెల్లోకి పట్టుకుంటాడు
అడవిపూల రంగుల్లో సువాసనల్లో తేలే
ఊహల్ని మూటకట్టుకుని ఇంటికొస్తాడు
పోడు పొలాల మీద రక్తం సూర్యుడి గాయం నుండి
ఎర్రెర్రని సూర్యరక్త కణాలని
బుట్టలో నింపుకుని కొండ దిగుతాడు.
తల్లిపక్షి పిల్లల నోట్లో బువ్వ పెట్టినట్లు
విన్నవి కన్నవి తెచ్చినవి కలగలిపి
తన గూటిలోని అంతర్జనాలకు తినిపిస్తాడు

గురువేం జేస్తాడు.
ఖనిజాలు మింగుతాడు
లోహపు ముక్కలు మింగుతాడు
కొన్ని బుల్లెట్లు కూడా మింగుతాడు
ఫిరంగి గుండుని రెండు చేతుల్లో పట్టుకుని పిసికి
అగ్నిని పిండుకు తాగి
లోపలి కొలిమిని రాజేసేకుంటాడు
నాగళ్లని, కొడవళ్లని, నాటు తుపాకుల్ని
తయారుచేసి జనాలకిచ్చి పంపుతాడు.
హిమ ఖండాలకు పోతాడు
పెంగ్విన్ పక్షులతోపాటు బుడి బుడి అడుగులు వేస్తూ
మంచుబండల మీంచి సముద్రాల్లోకి జారతాడు
జల నిధుల మీద పొర్లుతాడు
సాగర గర్భ నిశ్శబ్దంలో ప్రవాళ ద్వీపాల మధ్య ధ్యానిస్తాడు
సాగరఘోషతో తన నిశ్శబ్దాన్ని శృతి చేసుకుంటాడు
అలల మీది తెల్లని నురుగు పూలు కోసుకొచ్చి
నత్తగుల్లల నెత్తిన కిరీటాలుగా అలంకరించి మురిసిపోతాడు
శంఖాల అరల్లో సంచరించి శబ్ద రహస్యాలనూ
సముద్ర గర్జనల్నీ పద బంధాలతో పట్టుకుంటాడు
పద బంధాలతో పగ్గాలు అల్లి తెర చాపలెత్తుతాడు
దిగంతాల మీది సూర్యోదయాల్లోకి నౌకల్ని నడిపిస్తాడు
బుడ్డోడు అన్నీ విప్పేసి కాలువలోకి దూకినట్లు
వంతెన కింద ప్రవహించే పద్యంలోకి దూకి ఈత కొడతాడు
ఛాతీ మీద చందమామని కూర్చోబెట్టుకుని
వెల్లకిలా నిశ్శబ్దంగా శవమీత కొడతాడు

గురువేం జేస్తాడు..
తానొక శిశువుగా మారి మాటల్ని చీకుతూ ఉంటాడు
ఒక ఊహ మెడ చుట్టూ చేతులు వేసి మారాం చేస్తాడు
ఒక పద్యం చంకలో అడవంతా తిరుగుతాడు
ఓ కవిత నెత్తి మీది ఇప్పపూల
బుట్టలో కూర్చుని
ఊరేగుతూ ఊళ్లోకొస్తాడు
ఏక కాలంలో తల్లి కావడం
బుట్టలోని శిశువూ తానే
కావడం చూయిస్తాడు

(కే శివారెడ్డి పుస్తకానికి స్పందనగా..)

వసీరా

స్నేహితానికి, సాహిత్యానికి విబేధాలుంటాయా.. పోనీ ఏదైనా అంశం మీద ఈ రెంటికీ మధ్య వైరం వస్తుందా... అలా మాటా మాటా వస్తే వారిద్దరి మధ్య అగ్గి రాజుకుంటుందా.. అసలు మన ఇద్దరం వేర్వేరు... మన దారులు వేర్వేరు అని విడివిడిగా వడివడిగా విడిపోతారా.. లేక సాహిత్యమే మన వైరుధ్యం తప్ప మనం ఎప్పటికీ స్నేహితులమే అనుకుంటారా? మనిద్దరి సిద్ధాంతాలు వేర్వేరు కావచ్చు కానీ, మనం కలిసే ఉన్నామని సాహిత్య ప్రపంచానికి చెప్తారా... సైద్ధాంతికంగా విడివడిన శరీరాలు స్నేహితంగా మాత్రం సయామీ కవలలే అంటున్న స్నేహాలు తెలుగు సాహిత్యంలో చాలానే ఉన్నాయి. అవి తెలిస్తే ఇప్పుడు వీస్తున్న ప్రాంతీయ గాలి అచ్చమైన సాహిత్యం వైపే మళ్లుతుంది కదా!

స్నేహ సాహిత్యం... సాహిత్య స్నేహం!

గట్లుంటది..

ఇంతకీ విషయం ఏమంటే ఆనాటి రోజుల గురించి తలపోసుకోవడం. స్నేహంలో సాహిత్యం వొదిగిపోతుందని చెప్పడం. సాహిత్య ప్రముఖులు కోవెల సంపత్కుమారాచార్య, చేరాగా ప్రసిద్ధి పొందిన చేకూరి రామారావుల మధ్య సాహిత్య వైరం తెలుగు సాహిత్య లోకానికి... ముఖ్యంగా నేటి సాహిత్య సమాజానికి తెలియాలనే ఈ నాలుగు మాటలు.

కోవెల సంపత్కుమారాచార్య, చేరాగా పిలవబడే చేకూరి రామారావు ఇద్దరు మంచి స్నేహితులు. ఇద్దరూ మంచి సాహిత్యవేత్తలు. ఇద్దరికీ వారి వారి ఇష్టాలు, అభిరుచులు, ప్రేమలు, వ్యతిరేకతలున్నాయి. ముఖ్యంగా కవిత్వం విషయంలో అయితే మరీ ఎక్కువగానే ఉన్నాయి. దీనికి ముందు ఓ చిన్న విషయం చెప్పాలి. హైదరాబాద్ ద్వారకా హోటల్‌లో జరిగే నిత్య సమావేశాల్లో ఓ రోజు నేనూ ఉన్నాను. అక్కడికి చేరా వచ్చారు. చాలా హడావుడిగా వచ్చి శివారెడ్డి నుంచి ఓ పుస్తకం తీసుకుని వెళ్లిపోవడానికి లేచారు.

శివారెడ్డి కాఫీ తాగి వెళ్లండి. అంత హడావుడి ఎందుకు అని అంటే చేరా సంతోష్‌నగర్ వెళ్లాలి. ఎవరైనా దింపుతానంటే కాఫీ తాగుతా అన్నారు. అక్కడున్న నేను నా బండి మీద దింపుతానని చేరాని ఎక్కించుకొని బయలుదేరాను. మధ్యలో సంతోష్‌నగర్ ఎక్కడికి సార్ అని అడిగితే చేరా సంపత్కుమారాచార్య ఇంటికి. చూసి వారం రోజులైంది. త్వరగా పోనీ అన్నారు. దానికి నేను మీ ఇద్దరికి పడదు కదా.. ఆయనింటికేంటి అని అమాయకంగా అడిగితే ఆ రోజు చేరా నవ్విన నవ్వు నా జన్మలో ఇంకెవ్వరి దగ్గరా చూడలేదు. కనీసం మా కోనసీమలో కూడా.

ఇంతకీ విషయం ఏమిటంటే.. చేరాకు, సంపత్కుమారాచార్యకుఎ మధ్య నడిచిన వైరం కవిత్వం గురించే. కవిత్వానికి చందస్సు ముఖ్యమన్న వాదన సంపత్కుమారాచార్య గారిది... వచనంలో కూడా మంచి, చిక్కని కవిత్వం చెప్పవచ్చునన్నది చేరా వాదన. ఈ విషయంపై వీరిద్దరూ ఓ పత్రిక సాహిత్య పేజీలో దాదాపు ఇరవై వారాలు వాదులాడుకున్నారు. ఆ వాదులాట చదివిన వారెవరికైనా ఇక వీరిద్దరూ జన్మలో కలవరనే భావిస్తారు.

చిత్రం ఏమిటంటే ఆ చర్చ ముగిసిన తర్వాత ఆ ఇద్దరు కలిసి ఆ వాదాలన్నింటినీ కలిపి 'వచన పద్యం- లక్షణ చర్చ' పేరుతో పుస్తకం వేశారు. ఇదీ సాహితీ స్నేహం అంటే. మరో విషయం చేరా రాసిన చేరా శతకం మీద సంపత్కుమారాచార్య అద్భుత సమీక్ష రాస్తే, సంపత్కుమారాచార్య రాసిన శతాంకురం మీద చేరాతల్లో చేకూరి రామారావు ఆకాశానికెత్తారు. తెలుగులో ఇంతకంటే గొప్ప కావ్యం మరొకటి లేదంటూ చేకూరి రామారావు విశేషణాలతో రాశారు.

> సిద్ధాంతాలు వేరైనా, అభిప్రాయాలు కలవకపోయినా స్నేహించిన వారు తెలుగు సాహిత్యంలో చాలామందే ఉన్నారు. తెలియాలంతే. తెలుసుకోవాలంతే. మరో కోవెల వారు... అదే సుప్రసన్నాచార్య, విప్లవకవి వరవరరావుల మధ్య సైద్ధాంతికంగా చాలా విభేదాలున్నాయి. కానీ, వారి మధ్య స్నేహం మాత్రం అలా చిగురిస్తూనే ఉన్నది.

సుప్రసన్నాచార్య డాక్టరేట్ కోసం రాసిన సిద్ధాంత గ్రంథం నాలుగు కాపీలు కావాల్సి వచ్చిందట. ఆ రోజుల్లో జిరాక్స్ మిషన్లు లేవు. ఆ నాలుగు కాపీల్లో ఒక కాపీ వరవరరావు తానే స్వయంగా రాశారట. ఇదీ స్నేహం అంటే. వీళ్లంతా తెలంగాణ వారే అంటారేమో కొందరు బుద్ధిజీవులు. విజయవాడలో వీరంతా కలిసిన సందర్భాలు వస్తే ఉషశ్రీ మేడ మీద కూర్చుని అమావాస్య చీకటిని కూడా వెన్నెలలా మార్చే వారట. ఇలాంటి స్నేహాలు ఇప్పుడు ఎక్కడైనా కనిపిస్తే భలే బాగుంటుంది కదా!

ముక్కామల చక్రధర్
99120 19929

కొత్త కథకుల కరదీపిక

తెలంగాణ కథకు క్రొంగొత్త వ్యాస విమర్శిని మైలురాయి డాక్టర్ వెల్దండి శ్రీధర్ రాసిన 'కథా కచ్చీరు'. సాహిత్య ప్రక్రియలలో అత్యంత ప్రాచీనమైనది కథ. మానవ పరిణామ క్రమాన్ని వర్ణించే ఊహాత్మక పరికల్పన కూడా కథేనని భావించాలి. కథకు మూడు కోణాలుంటాయి. ప్రతీ కోణంలో రచయిత, పాఠకుడు, విమర్శకుడు ఉంటారు. వీరు ముగ్గురూ వారి వారి పాత్రలకే పరిమితం కాకుండా, ఒకరి పాత్ర నుంచి మరొక పాత్రలోకి పరకాయ ప్రవేశం చేస్తూ కథను పరీక్షకు నిలబెడుతూ ఉంటారు.

మంచికథకు కాలంతో సంబంధం లేకుండా కథ చుట్టూ సమకాలీనంగా, పాఠకుడు, విమర్శకుడు అధునాతన సాహిత్య సామాజికులుగా నిలబడతారు. కథలు కాలపరీక్షకు నిలబడాలంటే పై ఇద్దరినీ మెప్పించగలగాలి. డాక్టర్ వెల్దండి శ్రీధర్ తెలుగు సాహిత్య అధ్యాపకుడు, కవి, కథా రచయిత, సాహిత్య విమర్శకుడు, సాహిత్య పరిశోధకుడు, ప్రయోగ అభిరుచి కలిగిన నిత్య రచనాభిలాషి. కాబట్టి అతనిలో రచయిత, పాఠకుడు, విమర్శకుడు ముగ్గురూ ఉండటానికి అవకాశం లభించింది.

వెల్దండి శ్రీధర్ 72 మంది తెలంగాణ కథకుల కథలలో ప్రతీ కథను పాఠకుడిగా చదివి, రచయితగా తాను రాసిన కథగా భావించి, కథ పట్ల అత్యంత ప్రేమతో దాన్ని అక్కున చేర్చుకొని సమగ్ర అవలోకనం చేస్తూ, విమర్శకుడిగా ప్రతీ కథను ఆధిపత్య విమర్శ చేశాడు. కథ అనగానే వస్తువు, శిల్పం, భాష, పాత్రీకరణ, మానవ స్వభావ, అనుభవా ల అన్వేషణ, రచయితల ఘనీభవించిన దుఃఖం, జ్ఞాపకాలు, పాఠకుడిని ఆకట్టుకోవడానికి రచయిత చేసే ప్రయత్నాలు, సామాజిక అంశాలు వంటివి మాత్రమే కనబడతాయి. 'కథా కచ్చీరు' విమర్శలో శ్రీధర్ బాధ్యత ప్రత్యేకంగా కనబడుతుంది. రచయిత కథను సూక్ష్మ కథనం చేస్తూ, సంక్షిప్తతతో వివరించడం వల్ల పాఠకులను, పత్రికా నిర్వాహకులను అతి త్వరగా మెప్పించగలిగాడు. క్లుప్తతకు తోడు, సాహిత్యపర విశ్లేషణ చేశాడు.

ముందుమాటలో డాక్టర్ అఫ్సర్ చెప్పినట్టు 'గత పాతికేళ్లుగా తెలంగాణ కథ అనూహ్యమైన దూరాలకు ప్రయాణించింది. వస్తు వైవిధ్యంతో పాటు రూప శ్రద్ధను పెంచుకుంది. శ్రీధర్ ఈ సంపుటిలో ఉదాహరణగా చూపించిన ప్రతి కథా ఇదే విషయాన్ని ఒకటికి పది సార్లు రుజువు చేస్తుంది. ఆయా జిల్లాల యాసను పట్టుకోవాలన్న రచయితల తపన లోంచి జిల్లాల వారీగా కథా చరిత్రల మీద కూడా పరిశోధకులు పని చేస్తున్నారు. అయితే వీటన్నిటినీ ఏకతాటి మీదికి తీసుకురావడం తెలంగాణ కథా శిల్పం మీద కొన్ని మౌలికమైన ప్రతిపాదనలు చేస్తేనే సాధ్యం. శ్రీధర్ ఈ కచ్చీరులో సాధించింది అదే. కొత్తగా కథ రాయాలని కలం పట్టుకున్న వాళ్లు తప్పని సరిగా ఈ 'కథా కచ్చీరు'లో ఒక సాధారణ వ్యక్తిగా కూర్చోవాల్సిందే. మన ముందుతరం కథకులతో పాటు ఇవాళ్టి కథకులు ఎలా రాస్తున్నారో, వాళ్ల కథలను ఎలా చూడాలో ఈ కచ్చీరు వెల్లడిస్తుంది.

- శీలం భద్రయ్య, 9885838288

విరిగిపోయిన పడవ

ఏ ప్రేమికుల గుర్తో,
ఎక్కడి ప్రయాణికుల కలనో,
విరిగిపోయిన పడవ
సముద్రం ఒడ్డున పడి ఉంది

అతడు నేను కవిని అని చెప్పుకోలేదు

బ్యాండేజీ మీద నెత్తురు కనిపించినట్టు,
అందరు అతని కళ్లల్లో కవిత్వం చూశారు

యుద్ధాలు జరిగిన తర్వాత
అతడు కవిత్వం మానేసి,
మనుషులను ప్రేమించడం ముఖ్యమన్నాడు.

అతడు పుస్తకాలు ప్రచురించాడో లేదో తెలియదు కానీ,
ఎవరూ పట్టించుకోని విరిగిన పడవను,
బాగుచేయడం మొదలుపెట్టాడు
ఖైదీలందరూ వాళ్ల వయసు మరిచిపోయి,
చాలా ఏండ్లు గడిచాయి.

వాళ్లు, జైలు గోడలు కూలడం కోసం,
చిన్న పిల్లల్లా, ఇప్పటికీ కలలు గంటూ నిరీక్షిస్తున్నారు

ఎప్పుడో సూర్యుడు కిటికీ మీద,
పక్షులతో కలిసిపోతాడు

అతడు కవిత్వం రాస్తానని, ఎప్పుడూ అనలేదు

చీకట్లో, తుఫానుకు ఎదురుగా వెళ్లి,
దీపాలు పెట్టడానికి కొట్టుకుపోతుంటే తెలిసింది,
వెలుతురే అతడు రాసే కవిత్వమని!
ప్రయత్నమే దాని సౌందర్యమని!!

ఆశారాజు
93923 02245